# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 31 జనవరి 2025


## పదోవ తరగతి పుస్తకాలు పంపిణీ

బ్రహ్మంగారి మఠం, జనవరి 30 ప్రభాత వార్త :

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మైదుకూరు మిత్ర కమిటీ, మరియు నేస్తం సేవ సమితి, ఆధ్వర్యంలో గురువారం పదోవ తరగతి విద్యను అభ్యసిస్తున్న 37మంది విద్యార్థినిలకు ఉచితంగా ఎస్ఎస్సికి సంబంధించిన స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేయడం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య,,శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ హాజరుకాగా వారి చేతుల మీదుగా పుస్తక పంపిణీ కార్యక్రమం కమిటీ సభ్యులు చేపట్టారు ఎంఈఓ పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో రాబోవు 10వ తరగతి పరీక్షలను కష్టపడి చదివి మంచి మార్కులు సంపాదించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అనూష వల్ల రంగారెడ్డి నేస్తం సేవా సంస్థ ప్రతినిధి కొండారెడ్డి,ఉపేంద్ర మీ కోసం విష్ణువర్ధన్, హార్స్ సొసైటీ ఎర్రంపల్లి రవి విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు



## మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల, జనవరి 30, ప్రభాతవార్త :



పులివెందుల నియోజకవర్గానికి మూడు మద్యం షాపులు మంజూరు అయ్యాయని ఎక్సైజ్ శాఖ సిఐ చెన్నారెడ్డి తెలిపారు. పులివెందుల లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ , చక్రాయపేట వేముల మండలాలకు ఒకటి చొప్పున గౌడ కులానికి పులివెందుల , వేముల, ఈడిగ కులానికి చక్రాయపేట కేటాయించారన్నారు. ఆసక్తి కలిగి అర్హులైన వారు ఫిబ్రవరి 5 వ తేదీ లోపల ఆన్లైన్ ద్వారా కానీ, తమ కార్యాలయంలో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తేదీన పరిశీలన ఉంటుందని , 7వ తేదీ లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తారన్నారు. షాపులకు దరఖాస్తు చేసుకోవాలనుకున్నవారు కుల ధ్రువీకరణ పత్రం , రెండు లక్షల డిడి తేవాలని ఇది షాపు రాకపోతే వెనక్కి ఇవ్వడం జరుగుతుంది అన్నారు. సంవత్సరానికి పులివెందుల షాపుకు రూ.35 లక్షలు, వేముల, చక్రాయపేట షాపులకు రూ.325000 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

### పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు అన్యాయాలు త్వరలో

# బయటికి తీస్తాం

**పేదల సొమ్ము దోచుకున్న గజదొంగ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

**సూపర్ సిక్స్ పథకాలు తప్పక అమలు చేస్తాం**

**రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



రాయచోటి, జనవరి 30 ప్రభాతవార్త

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అన్యాయాలు అక్రమాలు త్వరలో బయటకు తీసి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల అరాచక పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 7 నెలల కాలంలోనే ప్రజలు సుఖసంతోషాలతో కాలం గడుపుతున్నారన్నారు. ప్రజలు మాపై చూపిన నమ్మకాన్ని తప్పక నెరవేరుస్తామని గతంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయడం జరుగుతుందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత ఐదు సంవత్సరాలలో పుంగనూరు నియోజకవర్గ ప్రజలనే మోసం చేసి వారి భూములను దోచుకోవడం జరిగిందన్నారు. మీ నియోజకవర్గ ప్రజలు నాలుగైదు సార్లు ఎమ్మెల్యేగా మీ కుమారుడిని ఎంపీగా గెలిపించారని అయినా వారి మీద ఎలాంటి దయాదాక్షయాలు లేకుండా వారికి ఎంతో అన్యాయం చేశారన్నారు. మీ నియోజకవర్గంలో గతంలో పాడి రైతులు లీటరు పాలు 25 రూపాయలకు అమ్ముకుని బ్రతికేవారని అలాంటి వారిని బెదిరించి కేవలం 18 రూపాయలకే వారి దగ్గర పాలు కొనుగోలు చేసి వారి కడుపు కొట్టింది నీవు కాదా! రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు మదనపల్లె ప్రాంతాల్లో ఉన్న మామిడి రైతుల పంటలను దోచుకుని కిలో 13 రూపాయలకు అమ్మే మామిడికాయలను కేవలం 8 రూపాయలకే కొనుగోలు చేసి మామిడి రైతుల కడుపు కొట్టలేదా! పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గతంలో ఏ శాఖలో పనిచేసిన ఆ శాఖకు సంబంధించిన ఆస్తులను భూములను దోచుకున్న గజదొంగవి కాదా! గతంలో ఇసుకను ఇతర రాష్ట్రాలకు పంపించి కోట్ల రూపాయలు దోచుకునింది నీవు కాదా! వేలకోట్ల ఎకరాలు దోచుకుని మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లను దగ్నం చేయించింది నీవు కాదా! మేము ఏమైనా అక్రమాలు అన్యాయాలు చేసి ఉంటే రుజువు చూపించు నువ్వు చేసిన అక్రమాలు అన్యాయాలు బయట వేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాము నువ్వు సిద్ధంగామేనా! ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలోనే మేము ఎవరిపైనా కక్ష సాధింపులు చేయలేదని ఇక మీదట కూడా ఎవరి మీద మేము కక్ష సాధింపులు చేయమన్నారు. మీ భార్య కుమారుని పైన ఉన్న అక్రమాస్తులను త్వరలోనే బయటికి తీసి చర్యలు తీసుకునే సమయం తొందరలోనే వస్తుందన్నారు. ముదివేడు ప్రాజెక్టు పరిధిలోని రైతుల భూములను లాక్కుని వారికి అన్యాయం చేశావు! గాలేరు నగరి కాలువ పనులకు సంబంధించి వేలకోట రూపాయలు దోచుకోలేదా! మీ ప్రభుత్వం మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని వేలాది మంది అధ్యాపకులను రిక్రూట్మెంట్ చేసుకొని కోట్ల రూపాయలు సొమ్ము చేసుకోలేదా! నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పరిపాలించాడని ఆయన ఒక విజన్ గల నాయకుడని ఆయనను ప్రశ్నించే అర్హత హక్కు నీకు ఏమాత్రం లేదని హెచ్చరించారు. మీరు ఐదు సంవత్సరాలలో చేసిన అభివృద్ధి మేము ఏడు నెలలో చేసిన అభివృద్ధికి పోల్చి చూస్తే ఎన్నో రెట్లు ఎక్కువ అభివృద్ధి కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రంలోని మూడు మెగా ప్రాజెక్టులకు ఫండింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో పోలవరం, అమరావతి వైజాగ్ స్టీల్ ప్లాంట్కు 45 వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రధాని నరేంద్ర మోడీ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇది మా ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి కాదా! ఉపాధి హామీ పథకంలో ఎన్నో అక్రమాలు అన్యాయాలు చేసి పేదల సొమ్మును దోచుకున్నది వైసిపి నాయకులు కాదా! రాబోయే రోజులలో గతంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలన్నీ తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని ఇప్పటికే గతంలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మంది కి పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు త్వరలో డీఎస్సీ పరీక్ష నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి మళ్లీ అధికారంలోకి మేమే రావడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పెద్దిరెడ్డికి సూచించారు.

## పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

కడప జనవరి 30 ప్రభాతవార్త



జిల్లాలోని వల్లూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. వల్లూరు పరిధిలో పుష్పగిరి క్షేత్రం ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదు దారుల ఫిర్యాదులపై సరైన రీతిలో క్షుణ్ణంగా విచారణ జరిపి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్ లో సిబ్బంది విధులను గురించి జిల్లా ఎస్.పి అడిగి తెలుసుకున్నారు. మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. వృత్తి పరమైన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. పెండింగ్ కేసులను త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు. నేరాలు జరగకుండా పగలు, రాత్రి ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని సి.ఐ రోషన్ కు సూచించారు. పాత నేరస్థులు, సస్పెక్ట్ ల కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజల తో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. ఆయా గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాల కు పాల్పడే వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్.పి గారు ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వాహనాలను త్వరగా డిస్పోజ్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ఎస్.పి గారి వెంట కడప డి.ఎస్.పి ఎ.వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, కమలాపురం సి.ఐ ఎస్.కె రోషన్, సిబ్బంది ఉన్నారు.

### ముఖ్యమంత్రి పర్యటనకు

## పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి..**

**అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి..**



సంబేపల్లి, జనవరి 30 ప్రభాతవార్త:..

రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి సంబేపల్లి మండలంలో సీఎం పర్యటన ఏర్పాట్లను, పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబేపల్లి మండలంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సంబేపల్లికి వస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను మంత్రి, ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. హెలిప్యాడ్, బారికేడ్లు, అగ్నిమాపక వాహనం ఏర్పాటు, భద్రతా సౌకర్యం, పార్కింగ్, ప్రోటోకాల్, సేఫ్ రూమ్ సౌకర్యం, విద్యుత్ సరఫరా, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం కల్పన తదితర అన్ని రకాల ఏర్పాట్లు సక్రమంగా చేయాలని మంత్రి, ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరా అంతరాయం కలిగితే వెంటనే జనరేటర్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. అదే విధంగా ముఖ్యమంత్రి కాన్వాయ్, సేఫ్ రూమ్, చికిత్సా పరమైన మందులు ఏర్పాటు చేయడంతోపాటు అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి పర్యటనను ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేద్దామన్నారు. పెన్షన్ల పంపిణీలో ప్రజలకు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా పెన్షన్లు అందుకునే లబ్ధిదారులను వారి వివరాలను అధికారులు మంత్రివర్యులకు, జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల రహితంగా జిల్లాను తీర్చిదిద్దాలి

రాయచోటి జనవరి 30 ప్రభాతవార్త




అన్నమయ్య జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి మరియు జిల్లా ప్రత్యేక అధికారి సూర్యకుమారి ఐసిడిఎస్ అధికారులు, సూపర్వైజర్లను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ నందలి పిజిఆర్ఎస్ హాలులో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ శాఖలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి మరియు జిల్లా ప్రత్యేక అధికారి సమీక్ష నిర్వహించారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల రైతు జిల్లాగా తీర్చిదిద్దేందుకు స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. జిల్లాలో అంగన్వాడి సేవలను మరింత పటిష్టవంతంగా నిర్వహించాలని చెప్పారు. కిషోర్ వికాసం కార్యక్రమానికి సంబంధించి అంగన్వాడి, పాఠశాలలు, కాలేజీలలో సఖి గ్రూపులను మరియు యువ గ్రూపులను ఏర్పాటు చేసి వారంలో ఒకరోజు గ్రూపులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బాలికలు వారి సమస్యలను వారే పరిష్కరించుకునే విధంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి గ్రూపు కి ఒక పీర్ గ్రూప్ లీడర్ ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాలను, అంగన్వాడి కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా బాత్రూములు, నీళ్ల సదుపాయం, విద్యుత్తు, ఇతర సదుపాయాలు సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వాష్ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు పరచాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ప్రత్యేక అధికారికి వివరించారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఐసిడిఎస్ శాఖ అధికారులు సూపర్వైజర్లకు సూచించారు. ఇందులో కొన్ని సమాజ పరమైన సమస్యలు ఉన్నప్పటికీ సామాజిక బాధ్యతలో ఉన్నటువంటి సర్పంచ్, గ్రామ పెద్దలు, బాల్య వివాహ నిషేధ కమిటీల ద్వారా అవగాహన కల్పిస్తూ బాల్య వివాహాల వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. అంతకు ముందుగా సమావేశం ప్రారంభంలో జిల్లాకు మొదటిసారిగా విచ్చేసిన జిల్లా ప్రత్యేక అధికారి సూర్యకుమారికి జిల్లా కలెక్టర్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సమావేశంలో మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఐసిడిఎస్ కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా ఐసిడిఎస్ అధికారిణి, జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధికారి, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### వన్య ప్రాణులకోసం వేసిన

## విద్యుత్ వైరు తగిలి రైతు మృతి

**:డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో తనిఖీలు : రైతు మృతిపై అనుమానాలు**

**:ధర్నా చేపట్టిన రైతు బంధువులు**

బద్వేలు ,జనవరి30, ప్రభాతవార్త:

మండల పరిధిలోని రాజుపాళెం పొలాలలో వన్యప్రాణుల కోసం విద్యుత్ వైరు తగిలి బీరం నరసింహారెడ్డి అనే రైతు మృతి చెందాడు.భూమి రీ సర్వే కోసం బెంగుళూరు నుంచి స్వంత గ్రామానికి వచ్చారు. బుధవారం నీ పొలం రీ సర్వే చేస్తున్నామని నరసింహారెడ్డికి అధికారులు సమాచారం ఇచ్చి వెంటనే రమ్మని తెలిపారు. ఈ విషయం వారి కుటుంబ సభ్యులకు తెలిపి పొలం గట్ల వెంట తన పొలం వద్దకు వెళ్తుండగా మార్గ మధ్యంలో వన్య ప్రాణులకోసం వేసిన విద్యుత్ వైరు తగిలి ఆయన మృతి చెందారు. అయితే అధికారులు నరసింహారెడ్డికి ఎంత సేపు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఆయన పొలం దగ్గర నుంచి వెళ్లి పోయారు. అనంతరం నరసింహారెడ్డి, కొడుకు, భార్య అనేక మార్లు ఫోన్ చేసినా ఎత్తక పోవడంతో అనుమానం వచ్చింది.

వెంటనే పొలం దగ్గరకు వచ్చే ప్రయత్నం చేశారు. అంతలోనే మేకలు కాసేవారు అటువైపు వెళ్తుండగా ఫోన్ రింగ్ అవుతున్న శబ్దం రావడంతో అటువైపు నరసింహారెడ్డి వద్దకు వచ్చారు. అంతలోనే కొంతమంది వ్యక్తులు విద్యుత్‌వైర్లు తగిలి మృతి చెందిన ప్రాంతంపక్కనే ఉన్న ముళ్ల కొంపలో వేశారు. అది చూసి దగ్గర ఉన్న బంధువులకు సమాచారం చేరవేశారు. దీంతో మృతుని బంధువులు మృతదేహం వద్దకు చేరుకుని రోధించారు. నరసింహారెడ్డి మృతదేహం కంపచెట్లలో ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ నాగభూషణ్,ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానం రావడంతో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంకు సమాచారం ఇవ్వడంతో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. నరసింహారెడ్డి మృతిపై అనుమానం ఉన్న బంధువులు ఎవరో ఏదో చేశారని ఆవేదనకు గుర య్యారు.

ఇంతలోనే కొంతమంది వ్యక్తులు అడవిజంతువుల కోసం కంచెలు వేసి వాటిని చంపి ఆ మాంసాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టగా విద్యుత్ వైర్లు తగిలి చనిపోయారని ఇది వేటగాళ్లపని అని తెలిపారు. వెంటనే బంధువులకు సమాచారం తెలపడంతో రోడ్డుపై రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. గతంలో కూడా వన్యప్రాణులకోసం వేసిన విద్యుత్ తీగలు తగిలి అనేకమంది మృతిచెందారని ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని, బంధువులు, గ్రామస్థులు రోడ్డుపై నిరసన చేపట్టడంతో వాహనాలు నిలిచిపోయాయి. సీఐ నాగభూషణ్ ఆధ్వర్యంలో బంధువులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మరోసారి ఇలాంటి వి జరగకుండా చర్యలు తీసుకుంటామని బంధువులకు, కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు హామి ఇవ్వడంతో హామీ విరమించారు.

## అనాధ బాలల సంక్షేమం కోసం మిషన్ వాత్సల్య

కడప జనవరి 30 ప్రభాతవార్త

అనాధ బాలల సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథక అమలు తీరు, బాల కార్మికులు,బాల్య వివాహాలు, అడాప్షన్, చిన్నపిల్లల భిక్షాటన వంటి వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ బాల కార్మికుల నిర్మూలన కోసం లేబర్ డిపార్ట్మెంట్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమన్వయంతో జిల్లాలో ఎక్కడ బాల కార్మికులు ఎక్కువగా పని చేస్తున్నారు, ఏ కారణాల చేత వారు బాల కార్మికులుగా మారుతున్నారు వంటి అంశాలపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వారికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఇచ్చే నాలుగు వేల రూపాలు సహాయం అందించి వారిని బడి బాట పట్టేలా పని చేయాలన్నారు. ప్రధానంగా లేబర్ శాఖ అధికారులు వ్యూహాత్మకంగా హోటల్స్, మెకానిక్ షాపుల పై నిరంతపు పర్యవేక్షణ వుంచి వారానికి నాలుగు సార్లు తనిఖీలు నిర్వహించాలన్నారు.జిల్లా లో భిక్షాటన చేసే హాట్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి ఎంతమంది పిల్లలు భిక్షాటన చేస్తున్నారో సర్వే చేసి వారికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా స్పాన్సర్షిప్ అందించి బడి లో చేర్పించి వారి తల్లి తండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, దేవాలయాలయాలు వంటి ప్రాంతాల వద్ద నిఘా ఉంచాలన్నారు.చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలు అందరికీ తెలిసేలా జిల్లాలో విరివిగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బాలల రక్షణ విషయంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధం ఉన్న అన్ని శాఖ లకు ఐసిడిఎస్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.గ్రామ,మండల స్థాయిలో పోలీసు, వైద్య ఆరోగ్య, ఐసిడిఎస్ అధికారుల సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. చట్ట వ్యతిరేక దత్తతల (అడాప్షన్) పై ప్రత్యేక దృష్టి సారించి,ఫీల్డ్ స్థాయిలోఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. అడాప్షన్ చట్టాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి,ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి, లేబర్ శాఖ అధికారి శ్రీకాంత్ నాయక్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, పంచాయతీ రాజ్ శాఖ అధికారిని రాజ్యలక్ష్మి, డి.ఎస్.పి రమాకాంత్,విద్యా శాఖ, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.



## పాలన పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టుంది

**డాక్టర్ సాకే శైలజానాథ్, ఏపీసిసీ మాజీ అధ్యక్షులు**

వేంపల్లి, జనవరి 30, ప్రభాతవార్త :



రాష్ట్రంలో పాలన పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందని ఏపీసిసీ మాజీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజానాథ్, ఏపీసిసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డిలు ధ్వజమెత్తారు గురువారం వేంపల్లిలో డాక్టర్ సాకే శైలజానాథ్, డాక్టర్ ఎన్. తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. వైకాపా, టిడిపి దొందూ దొందే అన్నారు. జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే, చంద్రబాబు కైలాసం చూపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, మద్య, జూద, డ్రగ్, గంజాయి ఆంధ్ర ప్రదేశ్ గా తయారు చేసి వెళ్లి పోయిందన్నారు. ప్రస్తుతం టిడిపి కూటమి పాలన అంత కంటే అధ్వానంగా తయారైందన్నారు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ లకు యాభై ఏళ్లకే పెన్షన్ తదితర సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని, అదనపు పన్నుల, చార్జీల భారం మోపమని, అధికంగా అప్పులు చేయమని టిడిపి కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు బారెడు హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక బెత్తెడు హామీలు కూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారి పోయిందని, గాడిలో పెట్టేందుకు కొంత సమయం పడుతుందని, అంత వరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేమని, ప్రజల పై పన్నుల భారం తప్పదని, ముఖ్యమంత్రి చంద్ర బాబు చావు కబురు చల్లగా చెప్పడం దురదృష్టకరమని మండిపడ్డారు. ఇది ఖచ్చితంగా నమ్మక ద్రోహం అన్నారు. ఇచ్చిన హామీలను తప్పక అమలు చేయాలని, తప్పించు కోవడం కుదరదన్నారు. హామీలు అమలు చేయడమా లేక పదవి నుండి దిగి పోవడమా తేల్చుకోవాలని వారు సవాల్ విసిరారు. మీడియా సమావేశంలో పులివెందుల నియోజకవర్గం సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి, అనంతపురం మాజీ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, తిరుపాల్ రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమయ్య, వేమానాగరాజ, వెంకటేష్, రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# అన్నమాచార్యలో బయో మెటీరియల్స్‌పై ఫ్యాక్టరీ ప్రోగ్రాం విజయవంతం

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, రాజంపేట మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 24 నుండి మొదలైన ఏటి ఏ ఎల్ ఏఐసిటిఈ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ గురువారం తో విజయవంతంగా నిర్వహించబడింది. "ఆర్థోపెడిక్, టిష్యూ ఇంజనీరింగ్ అప్లికేషన్ల కోసం అడ్వాన్స్డ్ బయోమెటీరియల్స్" అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో భారతదేశం నలుమూలల నుండి 123 మంది ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. ఎఫ్‌డిపిలో బయోమెటీరియల్స్ రూపకల్పన, సింథసిస్, ఉపరితల ఇంజనీరింగ్, 3డి ప్రింటింగ్, నానోటెక్నాలజీ, టిష్యూ ఇంజనీరింగ్ వంటి ఆధునిక అంశాలపై విశ్లేషణ జరిగింది. ప్రముఖ ఐఐటీలు, అమెరికా, ఫ్రాన్స్, భారతదేశంలోని నిపుణులు ఈ కార్యక్రమంలో లెక్చర్లు అందించగా, ఏటిఏఎల్ ఏఐసిటిఈ న్యూఢిల్లీ దీనికి ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఈ ఎఫ్‌డిపి ద్వారా ఫ్యాకల్టీ సభ్యులు బయోమెటీరియల్స్, మెడికల్ ఇంజనీరింగ్ రంగంలో తాజా పరిజ్ఞానాన్ని సొంతం చేసుకున్నారు. ఆర్థోపెడిక్, టిష్యూ ఇంజనీరింగ్ అప్లికేషన్లలో ఉపయోగపడే ఇంప్లాంట్లు, స్కాఫోల్డ్లు అభివృద్ధి, పరిశోధన నైపుణ్యాలు, 3డి మోడలింగ్, ఉపరితల ప్రాసెసింగ్, నానోటెక్నాలజీ విధానాలపై ప్రత్యేక శిక్షణ అందించబడింది. దీనివల్ల భవిష్యత్తులో ఆరోగ్య సంరక్షణ, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో కొత్త పరిశోధనలు, మెరుగైన వైద్య పరికరాల అభి




వృద్ధి సాధ్యమవుతాయి. ఈ ప్రోగ్రామ్ ఫ్యాకల్టీకి పరిశోధనలో కొత్త మార్గదర్శకాలు అందించడంతో పాటు, విద్యార్థులకు అత్యాధునిక పరిజ్ఞానం అందించేందుకు వారిని ప్రేరేపించింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు డా. సి.గంగిరెడ్డి (సెక్రటరీ, ఏఈటి ), డా. సి. రామచంద్ర రెడ్డి (ఛైర్మన్, ఏఈటి ), సి. యెల్లారెడ్డి (వైస్‌ఛైర్మన్ ), సి. అభిషేక్ రెడ్డి (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ట్రెజరర్, ఏఈటి ), డా. హెమంత్ కుమార్ (కన్వీనర్), అజయ్ కుమార్ రెడ్డి (కోఆర్డినేటర్), వెంకటేష్ (కోకోఆర్డినేటర్) తమ కీలక సహాయాన్ని అందించారు.

## జీతాలు పెంచి న్యాయం చేయాలని వినతి

కడప కార్పొరేషన్ జనవరి 30 ప్రభతవార్త:



కడప నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ వర్కర్స్ చాలీచాలని జీతాలతో పెంచాలని అవుట్సోర్సింగ్ ఉద్యోగులు అజాముద్దీన్, ఎస్.ఎండి.ఖాసీం, రామసుబ్బారెడ్డి, ఆనంద్‌లు అధికారులను కోరారు. ఈ మేరకు కడప కార్పొరేషన్ కమిషన్లు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో 350 మంది ఔట్సోర్సింగ్ వర్కర్లుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్నామని చెప్పారు. శానిటేషన్ వర్కర్స్ ఇస్తున్న జీవో ప్రకారం ఔట్సోర్సింగ్ వర్కర్లకు కూడా జీతాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని కూడా ప్రార్థించారు. రూ.13 వేల జీతం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. నిత్యవసర సరుకులు పెరిగిపోయాయని చెప్పారు. కార్యక్రమంలో రమేష్, ఎస్వి.రమణ తదితర ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రాచమల్లుకు మాతృవియోగం

ప్రొద్దుటూరు, జనవరి 30, ప్రభాతవార్త



మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి మాతృవియోగం కలిగింది. రాచమల్లు మునిరత్నమ్మ (82) గురువారం హైదరాబాదులో మృతి చెందగా అక్కడినుండి సాయంత్రానికి పార్థివ దేహాన్ని దొరసాని పల్లె లోని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నివాసానికి తీసుకువచ్చారు. దీంతో ప్రొద్దుటూరు నియోజకవర్గ వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకొని ఆమెకు నివాళి అర్పించారు. కాగా శనివారం ఆమె అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ

ఎర్రగుంట్ల జనవరి 30, ప్రభాతవార్త



పట్టణ పరిధిలో గురువారం ప్రథమచికిత్స కేంద్రాలను ఎర్రగుంట్ల అర్బన్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ శ్రీనాథ్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ఓబులేసు తనకి చేశారు. ఆర్ఎంపీలు నడుపుతున్న ప్రథమ చికిత్స కేంద్రాలలో కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, యాంటీబయాటిక్స్ ఇవ్వకూడదని, ఇంజక్షన్ ఫ్లూయిడ్స్ పెట్టరాదని, చట్ట విరుద్ధమైన మందులను నిలువ ఉంచిన,ప్రజలకు ఇచ్చిన కఠిన చర్యలు తప్పవు అన్నారు. వారి ఆదేశాలను అతిక్రమించినట్టు రుజువైతే తక్షణమే చికిత్స కేంద్రం సీట్ చేయబడుతుందని తెలిపారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరం

పోరుమామిళ్ల రూరల్, జనవరి 30 ప్రభాతవార్త:



బి. కోడూరు మండలం రాజుపాలెం గ్రామం లో పశు ఆరోగ్య శిబిరాలు కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో గర్భ నిర్ధారణ పరీక్షలు ఎదకురాని పశువులకు వైద్యం లేగ దూడలకు నట్టల నివారణ మందు, గొర్రెలు మేకలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుమారు 45 దూడలకు నట్టల నివారణ మందు 16 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యాధికారి భీమటం డాక్టర్ కే వెంకటసుబ్బయ్య, సహాయ సంచాలకులు భరద్వాజ్ బికోడూర్ పశుసంవర్ధక సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోరాట యోధుడు గాంధీజీ 77 వర్ధంతి

పోరుమామిళ్ల రూరల్, జనవరి 30 ప్రభాతవార్త:



గురువారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ విగ్రహానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ గౌసియాభేగం పూలమాల వేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ గౌసియాభేగం మాట్లాడుతూ గాంధీజీ దేశానికి మార్గదర్శక ఉన్నారని ఉప్పు సత్యాగ్రహంతో దేశంలోని ప్రజలందరినీ ఐక్యం చేశాడని బ్రిటిష్ వారికి ఎదురు నిలబండి అన్ని రకాలైనటు వంటి కులాలు మతాలు వర్గాలు కార్మికులు కర్షకులు, రైతులను అందరూ ఐక్యం పోరాటంతో బ్రిటిష్ వారిని తరిమికొట్టడంలో గాంధీజీ నడుము బిగించాడన్నారు. ఇలాంటి గాంధీజీని స్వాతంత్రం తెచ్చిన గాంధీజీని గాడ్సే చంపడం చాలా దుర్మార్గమని ఈ సందర్భంగా వారు అన్నారు. గాంధీజీ కలలగన్న దేశం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బీవి లూర్థుమేరి, ఓబులమ్మ, రవి, మరియమ్మలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రం తనిఖీ

కె.వి పల్లి జనవరి 30 ప్రభాతవార్త ః

అంగన్వాడి కేంద్రాన్ని రాష్ట్ర ఐసిడిఎస్ అధికారి సూర్యకుమారి గురువారం తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కలకడ మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ బాటవారిపల్లెలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని ఆమె తనిఖీలు నిర్వహించిన తెలిపారు.అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరు వారికి ఇస్తున్న పౌష్టికాహారం కేంద్రం పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలపై దృష్టి సారించి అంగన్వాడీ కేంద్రాలు పని చేస్తున్న కార్యకర్తలు సహాయకులు మరణించినచో వారికి ఖర్చుల నిమిత్తం 15000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం జరిగింది అన్నారు.రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులకు పుష్టికరమైన ఆహారాన్ని అందిస్తూ వారి బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ మస్తాన్వలి, డిఎల్‌పిఓ నాగరాజా, అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.



## కుష్టురహిత సమాజం నిర్మిద్దాం

పీలేరు జనవరి 30 ప్రభాతవార్త ః



మనందరం సమిష్టి బాధ్యత వహించి గాంధీజీ కలలుగన్న కుష్టురహిత సమాజం నిర్మిద్దాం అని డాక్టర్ రమేష్‌రెడ్డి సర్పంచ్ కొండయ్య నాయుడు సంయుక్తంగా ప్రజలకు పిలుపునిచ్చారు. కుష్టువ్యాధి వ్యతిరేక దినోత్సం సందర్బంగా మేల్లచేరువు సర్పంచి అధ్యక్షతన చిపాటివారిపల్లెలో కార్యక్రమ నిర్వహణలో పి.హెచ్.సి. తలుపుల ప్రధాన వైద్యాధికారి రమేష్‌రెడ్డి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మైకోబాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల చర్మానికి నరాలకు సోకె, కుష్ఠురోగుల గాయాలను గాంధీ తన చేతులతో శుభ్రపరిచి తద్వారా కుష్టువ్యాధి గ్రస్తులను తాకిన వ్యాధి ఇతరులకు సోకదని సందేశాన్ని ఇచ్చారని,కుష్టు వ్యాధి గ్రస్తులపట్ల మహాత్మా గాంధీ చూపిన ప్రేమ,సేవ ఎనలేనిదని అందుకే ప్రతి సంవత్సరం జనవరి 30 వ తేదీనాడు కుష్టు వ్యతిరేక దినోత్సవంగా జరుపుకొంటామని, కుష్టు ఏదశలో ఉన్న యం.డి.టి చికిత్స విధానములో నయమవుతుందని డాక్టర్ రమేష్ రెడ్డి ప్రజలకు తెలిపి, కుష్టురహిత సమాజం కోసం కృషి చేస్తామని, ప్రజలతో డాక్టర్ రమేష్ రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచి కొండయ్య నాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏయన్ యం నాగవేణి, రత్నం, సి.హెచ్.ఓ.కుముదా, సుధా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం

వాల్మీకిపురం, జనవరి 30 ప్రభాతవార్త ః




యుటిఎఫ్‌ఆ ధ్వర్యంలో ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేస్తామని మండల యుటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు షకీల్ అహ్మద్, నాగరాజులు అన్నారు. గురువారం స్థానిక మండల వనరుల కేంద్రం ఆవరణలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్లను ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి వెంకటరత్నం యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. తదుపరి క్యాలెండర్లను ఉపాధ్యాయులకు, యూటీఎఫ్ నాయకులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బాలాజీ, హరి, వెంకటనారాయణ, లక్ష్మీపతి, సుదర్శన్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి మరొకరికి గాయాలు

ముద్దనూరు, జనవరి 30, ప్రభాతవార్త:

మండలంలోని గంగాదేవి పల్లె గ్రామం వద్ద కడప తాడిపత్రి హైవే నందు గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు ముద్దనూరు పోలీసులకు తెలిపారు. వెంటనే సీఐ దస్తగిరి ఘటనా స్థలానికి చేరుకుని యాక్సిడెంట్ గల కారణాలను పరిశీలించారు. తాడిపత్రి నుంచి కడప వైపు వెళ్తున్న లారీ, ముద్దనూరు నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న టిప్పర్ ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో లారీ డ్రైవర్ బాలిరెడ్డి నాగ సుబ్బారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు మరో వ్యక్తికి ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ కిరణ్ కు స్వల్ప గాయలవడంతో చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## మహాత్మా గాంధీకి ఘన నివాళి

యర్రగుంట్ల జనవరి 30 ప్రభాతవార్త



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాణివనం యందు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు. గాంధీ కుష్టు రోగుల పట్ల చాలా మానవతా దృక్పథంతో కుటుంబ సభ్యులుగా చూసేవారు, మహాత్మా గాంధీ ఆశయాలను అనుగుణంగా నడుచుకుంటామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జోష్ణ మహాత్మా గాంధీకి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను నెరవేరుస్తామని పిహెచ్‌సి సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎమ్‌ఓ వీరభద్రయ్య స్థానిక పిహెచ్సి సూపర్వైజర్లు ఓబులేసు లక్ష్మీదేవమ్మ ఎంపీహెచ్వో రవిశంకర్ రాజు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## 11వ బెటాలియన్‌లో పోలీస్ డైరీ ఆవిష్కరణ

సిద్దవటం, జనవరి 30, ప్రభాతవార్త:



మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ పోలీస్ బెటాలియన్‌లో గురువారం 2025 పోలీస్ డైరీని ఇన్‌ఛార్జి కమాండెంట్ డి.నాగేశ్వరప్ప ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు సంబంధించి సమగ్ర సమాచారం కలిగి ఉన్న డైరీ పోలీసు సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్టు వ్యాదిపై అవగాహన కార్యక్రమం

సిద్దవటం, జనవరి 30, ప్రభాతవార్త:



సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్టు నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని వ్యాధి నిర్మూలనకు మహాత్మ గాంధీ శ్రద్ధాంజలి సందర్భంగా నిర్మూలనకు స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపైన్ నిర్వహించి తెలిపామని ఛర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులపై, వీపుపై నొప్పిలేని బొడిపెలు కనుబొమ్మలు మరియు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం లక్షణాలున్నవారు స్థానిక వైద్యశాలకు వెళ్లి పరీక్షించుకోవాలని విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రతి రోజు గుడ్డు తీసుకోవాలన్నారు. అలాగే కుష్టు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి రవిబాబు, వైద్యాధికారి డా.రంగలక్ష్మి, స్కూలు హెడ్మాస్టర్ శ్రీరాములు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీజీ మార్గమే ఆదర్శం



కడప కార్పొరేషన్ జనవరి 30 ప్రభాతవార్త:

మహాత్మా గాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా పిలుపునిచ్చారు. గురువారం కడపలోని ఆయన కార్యాలయంలో పూజ్య బాపూజీ కరంచంద్ గాంధీ జీ 77వ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్ళ బానిస సంకెళ్ల నుండి భారతదేశానికి స్వాతంత్రం లభించిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీ ప్రజలను డూ ఆర్ డై అని ఉద్బోధించారని పేర్కొన్నారు. గాంధీజీ అడుగుజాడల్లో నేటి యువత, ప్రజలు ముందుకు సాగి దేశం అభివృద్ధి పథంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ టిడిపి యువ నాయకుడు బి అబ్దుల్లా, షామీర్ పాల్గొన్నారు.

## కుష్టివ్యాధిపై అవగాహన ర్యాలీ



రామసముద్రం జనవరి30 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ నందు డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో కుష్టివ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కుష్టివ్యాధిపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం అంబేద్కర్ సర్కిల్ నందు మానవహారం ఏర్పాటుచేసి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది చే ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ ఎవ్వరికైనా వంటి పై స్పర్శలేని మచ్చలు ఉంటే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించాలని డాక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, ఆసుపత్రి సిబ్బంది ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

## ప్రతినెల జాబ్ మేళా నిర్వహిస్తాము

కమలాపురం జనవరి 30 ప్రభాత వార్త




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డి.ఆర్.డి.ఏ సీడప్ మరియు డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆధ్వర్యంలో గురువారం కమలాపురం వెలుగు కార్యాలయం నందు నందు జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా వెలుగు ఏపిఎం టి.గంగాధర్ సిడాప్ పిఓ. పృథ్వీ రాజ్, మరియు కంపెనీ ప్రతినిధులు ఎల్ఐసి ఆఫ్ ఇండియా నుండి అశోక్ కుమార్, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్ నుండి ఎస్వి సుబ్బయ్య విచ్చేశారు. ఎ.పి.యం. గంగాధర్ మాట్లాడుతు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే, ఇలాంటి ఖిజాబ్ ఫెయిర్‌ఖి, ప్రతి నెల నిర్వహించడం జరుగుతుంది అని వివరించారు. ఈ కార్యమానికి రెండు సంస్థల ప్రతినిధులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, సీడప్ జె.సి.ఓ సుబ్బలక్ష్మి, స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ సాంబశివ పాల్గొన్నరు.

## గాంధీ చూపిన ఆదర్శ బాటలో నడవాలి

రాజంపేట అర్బన్, జనవరి30 ప్రభాతవార్త



జాతిపిత మహాత్మా గాంధీ చూపిన ఆదర్శ బాటలో విద్యార్థులందరూ నడవాలని రాజంపేట మండల కో ఆప్షన్ నెంబర్ సయ్యద్ గౌస్ బాషా కోరారు. సర్వమత సమానత్వం, శాంతి, మానవతావాదం, సత్యం, న్యాయం, అహింస, లాంటివి మహాత్మా గాంధీ నమ్మిన, చూపిన ఆదర్శ బాటను గురువారం రాజంపేట గవర్నమెంట్ ఉర్దూ జూనియర్ కాలేజీలో ఎంపీజే( మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) ఏర్పాటుచేసిన మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ వార్డ్ స్కూల్ హెచ్ఎం నాగజ్యోతి మాట్లాడుతూ జనవరి 30వ తేదీ అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని, ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగా స్వాతంత్రం మనకు లభించిందని తెలిపారు. జాతిపిత ఆదర్శాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బాగా చదువుకొని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. రిటైర్డ్ టీచర్ అస్లాం గాంధీజీ పేరుతో ఉన్న పాటలన్నీ పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ఉర్దూ కాలేజ్ లెక్చరర్ సాదిక్, అడ్వకేట్ ముజఫర్ అహ్మద్, ఎంపీజే నాయకులు పి. మోసిన్ ఖాన్, ఇనాయ తుల్లా,కరీం, షేక్ నిస్సార్, షేక్ షాహిద్, అజ్మీ, ఇలియాజ్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు, 1వ వార్డు స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొని గాంధీకి నివాళులు అర్పించారు.

## ఘనంగా గాంధీ వర్ధంతి

మదనపల్లె, జనవరి 30 ప్రభాతవార్త :



పట్టణంలోని బెంగుళూరు బస్టాండులో మహాత్మగాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో గురువారం గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, బాలుస్వామి, షంషీర్, శివన్న, కలకడ వేణు, సిద్దప్ప, నిలకంఠ, పెంచుపాడుస్వామి, హరి, మదు, రాజేష్, నాగమణి, మురళి, నజీర్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్యస్వచ్ఛంద సేవా సంస్థలో గాంధీ వర్ధంతి

మదనపల్లె, జనవరి 30 ప్రభాతవార్త :




పట్టణంలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో గురువారం గాంధీవర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతిని చైతన్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపి ఆనందన్, కోశాధికారి పట్నం గిరిజన్‌మాల్, సెక్రటరీ కవితారాణిల ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రంలోని వృద్దులు, చిన్నారులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంల చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏసిబికి చిక్కిన ఎస్ఐ వెంకటసుబ్బయ్య

రామసముద్రం, జనవరి 30 ప్రభాతవార్త :



రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం లారీ యజమాని వద్ద లంచం తీసుకొంటూ ఏసిబికి చిక్కాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. మండలంలోని ఏటవాకిలిచెందిన లారీ ప్రమాదానికి సంబంధించిన కేసులో లారీ యజమానిని ఎస్ఐ లంచం అడిగాడు. దీంతో లారీ యజమాని ఏసిబి అధికారులను ఆశ్రయించడం జరిగింది. ఏసిబి అధికారులు వలపన్ని పెట్రోల్‌బంకు వద్ద ఎస్ఐని పట్టుకొన్నారు. రామసముద్రంలనో ఏసిబి అధికారులు ఎస్ఐని పట్టుకొన్నారన్న విషయం మండలంలో కలకలం రేపుతోంది.



## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

చిన్నమండెం జనవరి 30 ప్రభాతవార్త:

ప్రభుత్వం పశువుల అభివృద్ధి ఆరోగ్యం కొరకు 20వ తేదీ నుండి 31 వ తేదీ వరకు నిరహించడం కోసం ప్రవేశపెట్టిన పశు వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి ఊపసంచాలకులు మాలకొండయ్య తెలిపారు. అందులో భాగంగా మండలంలో గురువారం దిగువగొట్టివీడు, జంగంపల్లి గ్రామాలలో పశు వైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేసారు. ఈ శిబిరాలలో ఆవులకు, దూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందు త్రాగించారు. అలాగే వివిధ ఆరోగ్య సమస్యలపై పాడి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీదర్‌రెడ్డి, లోకేశ్ సిబ్బంది పాల్గొన్నారు,




## లైన్స్‌క్లబ్‌చే మెగా కంటి వైద్య శిబిరం

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

రాజంపేట ఎంవిఐ కార్యాలయంలో 36వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం లైన్స్‌క్లబ్‌చే మెగా కంటి వైద్య శిబిరం జరిగింది. ఎంవిఐ వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు అందరూ తప్పనిసరిగా కంటి పరీక్ష చేయించుకోవాలన్నారు. లైన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు, రీజనల్ చైర్మన్ సంభావ వెంకటరమణ, జోన్ చైర్మన్ వై సుబ్రమణ్యం రాజుక్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు, కోశాధికారి నరసింహ, సీనియర్‌లైన్స్‌క్లబ్ సభ్యులు టి లక్ష్మీనారాయణ, ప్రభుత్వ వైద్యులు అశ్విని కుమార్, ఆప్తమాలజిస్ట్ చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ 40 సంవత్సరాలు నిండిన ప్రతి డ్రైవర్ కూడా ప్రతి సంవత్సరం కంటి పరీక్ష నిర్వహించుకోవాలని దానికి రాజంపేటలో లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు వాటిని చక్కగా వినియోగించుకొని మీకు కావాల్సిన కంటి అద్దాలు ఉచిత మందులు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క డ్రైవర్ కు తమ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని, అలాగే మీ వాహనంలో ఎంతమంది మిమ్మల్ని నమ్ముకుని ప్రయాణిస్తున్నారో వారిని దృష్టిలో పెట్టుకుని రూల్స్ పాటిస్తూ చక్కగా ప్రజలను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు సక్రమమైన పాత్ర పోషించాలని, ఎంతో విలువైన ప్రాణాలు అన్నిటిని మీ చేతుల్లోనే ఉన్నాయని కావున మీరు అశ్రద్ధ వహించకుండా వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించి నడపాలన్నారు. అనంతరం డ్రైవర్ల అందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్స్



క్లబ్ సభ్యులు చంద్ర నాయుడు వివిధ వాహన డ్రైవర్లు ఏజెంట్లు పాల్గొన్నారు.

## కడప ఉక్కు భిక్ష కాదు మన హక్కు

ముద్దనూరు, జనవరి 30, ప్రభాతవార్త:

కడప ఉక్కు ఎవరి ఇచ్చే భిక్ష కాదని అది మన హక్కు అని పశ్చిమ రాయలసీమ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్.గేయానంద్ గురువారం తెలిపారు. రెండు రోజుల పాటు జిల్లాలో జరిగే సీపీఎం జీపు జాతా ముద్దనూరుకు చేరుకున్న సందర్భంగా స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా రాయలసీమకు అన్యాయం జరుగుతూనే వుందన్నారు. ఇక్కడి పాలకులు చెవులు వున్న వునపడనట్టు,కళ్ళు వున్నా కనబడనట్టు నటిస్తున్నారాన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించలేక నాడు వైఎస్ఆర్సీపీ, నేడు టీడీపీ రెండు ఒకటే పరిస్థితి అన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు రామన్న మాట్లాడుతూ నాడు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా ఎలా రాష్ట్రమంతా పోరాడి పరిశ్రమను సాధించుకున్నారో ఇప్పుడు కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించి కడప ఉక్కును సాధించుకుంటామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎఫ్రవరి 1,2,3 తేదీలలో సీపీఎం రాష్ట్ర మహాసభలు నెల్లూరులో జరుగుతున్నాయని ఆ మహాసభలలో కడప ఉక్కు ప్రధాన అజెండాగా రూపొందించి చర్చించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే జిల్లాలో రెండు రోజుల పాటు సీపీఎం జీపు జాతా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్,అన్వేష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల. శివకుమార్,సీపీఎం నాయకులు రాజామని,భైరవ ప్రసాద్, డి వైఎఫ్ఐ ముద్దనూరు నాయకులు సుబ్బారాయుడు, కరుణాకర్, సంజీవ పాల్గొన్నారు.



## పశు వైద్య శిబిరం విజయవంతం

సుండుపల్లి, జనవరి30,ప్రభాతవార్త:

మండలంలోని బాగంపల్లి పంచాయతీలోని బాగంపల్లి, గంగిరెడ్డిగారిపల్లిలో గురు వారం పశువైద్య శిబిరం ని ర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయా గ్రామాలలోని పశువులకు పశు ఆరోగ్య శిబి రాలు ఎర్పాటు చేసి 42

## ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు

వాల్మీకిపురం, జనవరి 30 ప్రభాతవార్త :



బాపూజీ మార్గంలోనే యువత ముందుకెళ్లాలని మాజీ ఎంపీపీ, తెదేపా రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకట్రమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డిలు అన్నారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గాంధీ సర్కిల్లోని గాంధీజీ విగ్రహం వద్ద తెదేపా నాయకులతో కలిసి వారు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం దేశానికి గాంధీజీ అందించిన సేవలను వారు కొనియాడుతూ భారతదేశ స్వాతంత్రం కోసం పరి తపించిన మహనీయుడు, అంటరానితనాన్ని రూపు మాపి, దినార్ధారణకు, హరిజనోదరణకు కంకణ బద్దులై తన జీవిత పర్యంతం ప్రజాసేవలో మనుగడ సాగించి సిద్ధాంతాల వలన హత్యకు గురయ్యారన్నారు భారతదేశ ప్రజల గుండెల్లో ఇప్పటికీ, ఎప్పటికీ నిలిచిపోయిన మానవతావాది అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ చంద్రమౌళి, మాజీ సర్పంచి రాజేంద్రచారి, తెదేపా నాయకులు పీవీనారా యణ, కోసూరి రమేష్, సురేంద్రవర్మ, సయ్యద్బాషా, డిష్ బ్రదర్స్, వెంకట్ర మణ, చాను, బొక్కసం రామకృష్ణ ఆనంద్, ఖలందర్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతానికి కృషి చేయాలి



రాయచోటి జనవరి 30 ప్రభాతవార్త

సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్ఆర్ సిపి రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. జగన్ హయాంలో కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించారన్నారు. అందరికీ సంక్షేమ ఫలాలు అంది అన్నివర్గాల ప్రజలు సంతోషంగా వుండేవారన్నారు. ఎన్నికల సమయంలో అపద్దపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఏడు నెలల పాలనలోనే రూ 1.20 లక్షల కోట్లను అప్పులు చేశారని ఆయన మండిపడ్డారు. ఒక రూపాయి బిళ్లకు ఒక ప్రక్క బొమ్మ, మరో పక్క బొరుసు వుంటుందనేది ఎంత వాస్తవమో మా పార్టీవారిపై కేసులు పెట్టినవాటినన్నింటినీ గుర్తుకు పెట్టుకుంటామన్నారు. జగన్ సీఎం అయితే మా దెబ్బ ఏంటో రుచి చూపిస్తామన్నారు. దాడులకు ప్రతి దాడులు జరుగుతాయన్నారు. కార్యకర్తలు, నాయకులుకు తాము, పార్టీ అండగా ఉంటుందని, జగన్ తోడుగా నిలుస్తారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లను అక్రమంగా కూల్చుతోందని, అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేయక, ఎటువంటి సంక్షేమ పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. పార్టీ నూతన కమిటీలు చురుగ్గా పనిచేయాలన్నారు. అధికార పార్టీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో మహిళలకు,యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చక మోసగిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. జగన్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాధ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది మాసాలవుతున్నా ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేయక ప్రజలను మోసగిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను చూస్తుంటే భయం వేస్తోందంటూ ఇప్పుడు చంద్రబాబు చెప్పుచున్నారని, ఎన్నికల సమయంలో చంద్రబాబుకు ఆర్థిక పరిస్థితి తెలీదా అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల చంద్రబాబు తీరును మాజీ ఎంపీ హర్షకుమార్ కూడా విమర్శించారు. వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు, నాయకులు ,సోషియల్ మీడియా వారిని అధికార పార్టీ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారి బెదిరింపులుకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రానున్న ఏ ఎన్నికలనైననూ ఎదుర్కొనేందుకు సిద్ధంగా వుందామని ఆయన పిలుపునిచ్చారు. జగన్ ను మరోసారి సీఎంగా చేసుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

వీరపునాయునిపల్లి, జనవరి 30, ప్రభాతవార్త :



ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ రఘునాథ రెడ్డి అధ్యక్షతన గురువారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధికారులు ఈ సమావేశంలో తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సర్పంచులు, ఎంపీటీసిలు తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్యపై ఎక్కువ ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలం దగ్గరలో ఉన్నందువలన మండలంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా అవసరమైన కొన్ని గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన ఏ పని అయినా తాను చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రజా సమస్యలపై ఎవరైనా తనను కలవ వచ్చునని, పార్టీలకు అతీతంగా తాను ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపారు. సర్వరాయ సాగర్ పూర్తి చేసి తాగు, సాగునీరు ఇస్తామని తెలిపారు. ఎంపీపీ రఘునాథ రెడ్డి మాట్లాడుతూ రైతులు రబీ సీజన్ లో పంటలు నష్ట పోయారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే తమ ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. మొట్ట మొదటి సారిగా సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే చైతన్య రెడ్డిని సర్పంచులు, ఎంపీటీసిలు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో చంద్ర మోలీస్వర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శిలాఫలకాలకే పరిమితమైన ఉక్కు పరిశ్రమ

ఎర్రగుంట్ల జనవరి 30 ప్రభాతవార్త



జీపు జాతరలో భాగంగా ఎర్రగుంట్ల పట్టణంలోని నాలుగు రోజులు కూడలిలో గురువారం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ శిలాఫలకాలికే పరిమితం అయింది అని కార్యరూపం దాల్చలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ సిపిఎం సీనియర్ నాయకులు బయన్న అన్నారు. ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సిపిఎం రాష్ట్ర 27వ మహాసభలు నెల్లూరులో జరగనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా గురు శుక్రవారాలు జిల్లా వ్యాప్తంగా జీపుజాత నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమను విస్మరించి అనకాపల్లిలో ఏర్పాటు చేయాలని మిట్టల్ కార్పోరేట్ కంపెనీ దావోస్ కు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ స్థాపనకు ఖనిజ సంపదతో పాటు, నీటి వసతి, రోడ్డు వసతి అన్ని రకాలుగా ఉందన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమకు అన్యాయం జరుగుతుందని వివరించారు.

# కడప ఉక్కు.. ఆంధ్రుల హక్కు



పులివెందుల, జనవరి 30, ప్రభాతవార్త :

కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అని సిపిఎం రాష్ట్ర నాయకులు రామన్న అన్నారు. గురువారం రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం జీపు జాత లో భాగంగా పులివెందుల పట్టణంలో పూల అంగళ సర్కిల్ నందు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్వేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం రాష్ట్ర నాయకులు రామన్న, సిపిఎం కడప జిల్లా కమిటీ సభ్యులు చాంద్ బాషా మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ జిల్లాల్లోని ఒక్కటైన కడప జిల్లాలో భారీ ఉక్కు పరిశ్రమ నిర్మించడానికి పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని పాలకులు ఉక్కు ఫ్యాక్టరీని కడప జిల్లాలో ఏర్పాటు చేయడానికి నిరాకరించడం దారుణమన్నారు. జమ్మలమడుగు ప్రాంతంలో పది సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాయకులు శంకుస్థాపనలు చేస్తున్నరని కాని కేంద్ర ప్రభుత్వ నిర్మించడానికి పూర్తి సహకరించలేకపోవడం దారుణమని ఆరోపించారు. కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని తీసుకొని పోరాటం చేయాలని ఈ విషయాలను భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర 27వ మహాసభలు నెల్లూరులో జరుగునున్న కారణంగా ఈ జీప్ జాత నిర్వహించడం జరిగినదని తెలిపారు. సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చించి పోరాటాలకు కార్యచరణ నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా నాయకులు రాజమణి, భైరవ ప్రసాద్, రమణ, తులసి, పులివెందుల ఏరియా కార్యదర్శి గపూర్ పాల్గొన్నారు.

## పెద్దేరు ప్రాజెక్టు కాలువల మరమ్మత్తులతో మహర్దశ

తంబళ్లపల్లె జనవరి 30 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మండలం జుంజుర పెంట పంచాయతీ పరిధిలోని పెద్దేరు ప్రాజెక్టు కాలువల మరమ్మత్తు పనులతో భవిష్యత్తులో రైతులకు సాగునీరు తోబాటు పశువులకు తాగునీరు అంది మహర్దశ పట్టబోతోంది. గత కొంతకాలంగా పెద్దేరు ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలు ముండ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు అటవీ ప్రాంతాన్ని తలపించే విధంగా తయారైంది. కూటమి ప్రభుత్వం రాకతో పెద్దేరు ఆయకట్టు చైర్మన్ కొట్టాల శివకుమార్ కోరిక తో తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి చొరవ తీసుకొని ప్రాజెక్టు కాలువల మరమ్మత్తులకు కోటి రూపాయలు మంజూరుకు కృషి చేశారు. గత నెల రోజులుగా ప్రాజెక్ట్ కాలువ పనులు కాంట్రాక్టర్ శ్రీనివాసుల రెడ్డి చైర్మన్ శివకుమార్, కమిటీ సభ్యులు, ఆయకట్టు రైతుల సలహాలు, సూచనలతో మరమ్మతు పనులు నాణ్యతా లోపం లేకుండా శరవేగంగా చేస్తున్నారు. ప్రాజెక్ట్ కుడి కాలువ 17 కిలోమీటర్లు, ఎడమ కాలువ 15 కిలోమీటర్లు లో పూర్తిగా కంపచెట్లు తొలగింపు, కాలువ పక్కన రహదారులు, కాలువలో గండ్లు పటిష్టంగా పూడ్చేపనులు ఊపందుకున్నాయి. ఈ సందర్భంగా చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ కాల్వ మరమ్మత్తు పనులు జరగడం ఇన్చార్జి జయ చంద్రారెడ్డి, మంత్రి రాంప్రసాద్ రెడ్డి చలవేనని ప్రాజెక్టులో ఇంకా తాగునీటి బోరు, విద్యుత్తు, పార్కుల మరమ్మతులు, కార్యాలయ మరమ్మతులు, క్వార్టర్స్ మరమ్మతులు, మరుగుదొడ్లు, బోటింగ్ సిస్టం, ఇంకా పలు అభివృద్ధి పనులు పూర్తయితే జిల్లాలో పెద్దేరు ప్రాజెక్టు ప్రముఖ పర్యాటక కేంద్రం తో పాటు వేలాది ఎకరాల కు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల పెంపుతో ఈ ప్రాంతం సస్య శ్యామలం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు

బద్వేలు అర్బన్, జనవరి30, ప్రభాతవార్త:



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో భాగంగా గురువారం రెండవ రోజు కార్యక్రమంలో పలు రకాల ప్రత్యేక పూజలను అమ్మవారికి ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీ కొలిశెట్టి నాగరాజ, జాయింట్ సెక్రటరీలు సగ శాసురేష్‌బాబు, వైభవ్ ప్రసాద్, ట్రెజరర్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్లు దర్శి వెంకటేశ్వర్లు, మునగా చలమయ్య, మరియు పలువురి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా 21 మంది బాలికలకు మంగళ స్నానాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీ కొలిశెట్టి నాగరాజులు మాట్లాడుతూ ఆర్యవైశ్య కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్నిమూడు రోజుల పాటు బద్వేలు పట్టణంలో వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, కావున పట్టణ పరిసర ప్రాంతాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.గురువారం వాసవిమాత అమ్మవారు ప్రత్యేక అలంకారంతో పలువురు భక్తులకు దర్శనమిచ్చారు. సాయం సంధ్యావేళ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు పబ్బతి చంద్రశేఖర్, చింతకుంట సుభాషిణి, స్టేట్ ఉపాధ్యక్షులు కొండపల్లి దేవి, వనితాక్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, కుప్పం శర్వాని,వల్లంకొండు ధనలక్ష్మి, కొప్పరపు లత, తులసి వరలక్ష్మి , బచ్చు పార్వతమ్మ, గంగిశెట్టి ధనమ్మ, వందవాసి ధనమ్మ,మెంటా లక్ష్మినారాయణమ్మ, అవోపా మహిళా విభాగ అధ్యక్షురాలు సముద్రాల మాధవి లత, పెసల శ్రీవాణి, సుప్రజ, జూటూరు పద్మలత, తులసి లక్ష్మిదేవి, చింతకుంట సుభాషిణి, పెసల సుధాకర్, కొలిశెట్టి వెంకటసుధ, రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయ్ చింతకుంటక్రిష్ణమూర్తి, వల్లంకొండు శారద, గంగిశెట్టి ధనమ్మ, పుట్టా రాజేశ్వరమ్మ, రాజా వెంకటేశ్వర్లు, దేవతివెంకటసుబ్బారావు, తులసి వెంకటసుబ్బయ్యతో పాటు ఆర్యవైశ్య వర్తక సంఘం, యువజన సంఘం, మహిళా మండలి తదితరులు పాల్గొన్నారు.



## కన్నుల పండువగా శ్రీవారి కల్యాణ

బద్వేలు అర్బన్, జనవరి 30 ప్రభాత వార్త



పట్టణంలోని నెల్లూరులో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కల్యాణం కన్నుల పండువగ నిర్వహించారు. కలియుగ దైవము, కలియుగ వైకుంఠ వాసుడు శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర మైన శ్రవణా నక్షత్రం సందర్భంగా ఈ కళ్యాణ కార్యక్రమం నిర్వహించారు.తదుపరి అన్న ప్రసాద వితరణ జరిగింది. ప్రతి నెల శ్రవణా నక్షత్రం రోజున కళ్యాణ దాతలు రామనబోయిన పుల్లయ్య, సతీమణి కృష్ణమ్మ, కుమారుడు మురళి, సతీమణి సునీతల ఇతర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు మరియు ఆలయ ఈవో ఎస్ రామలింగా రెడ్డి, ఆలయ సిబ్బంది, ప్రతాప్ సింహరాజు, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## మహాత్మా గాంధీ 77వ వర్ధంతి

మైదుకూరు, జనవరి 30, ప్రభాతవార్త:



అమ్మవారి శాలలో జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సర్భంగా ఘనంగా నివాళులు అర్పించడమైనది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ సెక్రటరీ డి.వి సునీల్,ఆర్యవైశ్య సభ ట్రెజరర్ వెంకటసుబ్బయ్య, మరియు కమిటీ సభ్యులు వేణుగోపాల్, సికాకోల గోపాల్,కోట సంజీవ కుమార్,ఎన్ శేషుబాబు,అయ్యప్పు శెట్టి సురేంద్ర,కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంతు సుబ్రహ్మణ్యం,కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గురు ప్రసాద్, వాసవి క్లబ్ ట్రెజర్ కుప్పం కిషోర్, వనిత క్లబ్ అధ్యక్షురాలు కరములపూడి జ్యోతి,వనిత క్లబ్ ట్రెజరర్ కుప్పం మాధవి లత,వనిత క్లబ్ సెక్రటరీ అయ్యప్ప శెట్టి నవీనలక్ష్మి,పాస్ట్ ప్రెసిడెంట్ మల్లిపెద్దు కళ్యాణి,జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ పబ్బతి గోపాల్, రీజియన్ చైర్మన్ సూరే సుబ్బరాజ,వనిత క్లబ్ సభ్యురాలునూకల ఉషా కిరణ్, లేపూరు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు నియమాలను పాటించాలి



మదనపల్లెక్రైం, జనవరి 30 ప్రభాతవార్త :

వాహనదారులు రోడ్డు నియమాలను పాటిస్తూ వాహనాలు నడపాలని మదనపల్లె డిఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాలో భాగంగా మహిళలతో నిర్వహించిన ర్యాలీని డిఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తమకు సహకరించాలన్నారు. వాహనం నడిపే సమయంలో వారి కుటుంబసభ్యులను గుర్తించుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపటం, ఓవర్‌లోడుతో వెళ్లటం చాలా ప్రమాదకరమైనవన్నారు. అలాగే మైనర్లు, లైసన్ లేని వాహనాలు నడపరాదన్నారు. ఇకపై ప్రతిరోజు వాహనాలు తనిఖీ చేయటం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, లైసన్స్‌లు లేకపోవటం, హెల్మెట్ ధరించకపోవటం, సీటు బెల్ట్‌లేకుండా వాహనాలు నడిపై వారిపై భారీగా జరిమాన విధిస్తామన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థులు, పోలీసులు నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభమై సిటిఎం రోడ్డు, టౌన్‌బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, మల్లికార్జున సర్కిల్ మీదుగా సాగింది. కార్యక్రమంలో సిఐలు ఎరిసావల్లి, రామచంద్ర, కళావెంకటరమణ, రమేష్, ఎస్ఐలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండలంలో ఎరువుల కొరత లేదు

దువ్వూరు, జనవరి 30, ప్రభాతవార్త:



దువ్వూరు మండలంలో రైతులకు అవసరమైన అన్ని రకాల రసాయనిక ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎటువంటి ఎరువుల కొరత లేదని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలైన దువ్వూరు, పెద్దజొన్న వరం, కృష్ణంపల్లె, చిన్న సింగనపల్లె, గుడిపాడు తదితర కేంద్రాల్లో రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి యూరియా, డీఏపీ కొనుగోలు చేయవచ్చు అన్నారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ దుకాణాలలో కూడ కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసుకోవచ్చు అన్నారు. ప్రస్తుతం మండలంలో ఎటువంటి ఎరువుల కొరత లేదని రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## ఖాజీపేట వైకాపా అధ్యక్షుడిగా దుగ్గిరెడ్డి

ఖాజీపేట, జనవరి 30, ప్రభాతవార్త:



గురువారం నాడు జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశంలో వెస్ఆర్సీపి ఖాజీపేట మండల అధ్యక్షులుగా దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. కాగా మండల అధ్యక్షునిగా ఆయన ఎన్నిక కావడం ఇది మూడవ సారి. ఈ సంధర్భంగా దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి 'వార్త' తో ముచ్చటిస్తూ తనని వరుసగా మూడవ సారి మండల అధ్యక్షునిగా ఎన్నుకున్న పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానని, ఎన్నికకి సహకరించిన కడప ఎంపీ అవినాష్ రెడ్డికి మరియు మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురాంరెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, పార్టీ ఇచ్చిన ఈ బాధ్యతతో పార్టీ కార్యకర్తలను, శ్రేణులను, నాయకులను అందరిని కలుపుకుంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే కడప జిల్లా జనరల్ సెక్రటరీ ఖాజీపేట వైకాపా నాయకులు పి.వి రాఘవరెడ్డి మరియు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా పత్తూరుకి చెందిన వైకాపా నాయకులు ఎం.వెంకట సుబ్బయ్యలు ప్రమాణస్వీకారం చేశారు.

## కుష్టు వ్యాధిని తొలి దశలోనే నయం చేయవచ్చు



ఖాజీపేట, జనవరి 30, ప్రభాతవార్త:

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టు వ్యాధి–స్పర్శ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు పుల్లూరు, పత్తూరు సచివాలయంలో గురువారం నాడు కుష్టు వ్యాధి అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆయేషా సుల్తానా మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రి అనే క్రిమి వలన వ్యాధి కలుగుతుందని, దీనిని తొలి దశలో గుర్తించి మల్టీ డ్రగ్ తెరఫీ ద్వారా వ్యాధిని నయం చేయవచ్చునని మరియు ఫైలేరియా బోదకాలు వ్యాధి వలన కలుగు నష్టముల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు చర్మంపై స్పర్శలేని మచ్చలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరికాళ్లలో, అరిచేతుల్లో స్పర్శ కోల్పోవడం, చేతులు నుండి వస్తువులు జారిపోవడం, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం ఈ వ్యాధి యొక్క ముఖ్య లక్షణాలని అన్నారు. ముఖ్యంగా నీటి ద్వారా, ఆహారం ద్వారా, కీటకాల ద్వారా, దోమల ద్వారా, గాలి ద్వారా వచ్చు వ్యాధుల గురించి వాటి నివారణ గురించి విధ్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని దోమతెరలు వాడాలని, తడి బట్టలు వాడాలని, మహాత్మాగాంధీ కన్న కలలు నిజం చేయాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ నోడల్ ఆఫీసర్ ఈ.అరుణకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ ఏ. శోభన్‌బాబు, బి.కృష్ణ ప్రియ, ఆరోగ్య కార్యకర్త బి.శాంతమ్మ, హేమలత, విజయమ్మ, ఆశా వర్కర్ సునీత, ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది, స్టాఫ్ నర్స్ లక్ష్మి కాంతమ్మ, సుప్రజ, ఫార్మసీ ఆఫీసర్, కేశవయ్య, దుర్గప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీసీఆర్ పెన్షన్ కానుక పంపిణీ

పెనగలూరు, జనవరి 30, ప్రభాత వార్త:

మండలంలోని పంచాయతీల్లోని పెన్షన్ అందని గిరిజన కాలనీల్లోనీ గిరిజనులకు బిసిఆర్ పింఛన్ కానుకగా రెండు వేలు రూపాయలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కొల మురళి కృష్ణ మాట్లాడుతూ బిసిఆర్ పింఛన్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి పింఛన్ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, హబీబ్, తాటిబోయిన దనయ్య పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రాల ఆకస్మిక తనిఖీ



పీలేరు జనవరి 30 ప్రభాతవార్త ః

రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏ. సూర్య కుమారి అంగన్వాడి కేంద్రాల ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ఆమె పీలేరు పట్టణం, యల్లమంద క్రాస్‌లోని అంగన్వాడి కేంద్రం, కలకడ మండలం, బాటవారిపల్లె అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు పట్టికను, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా, పౌష్టికాహారం పథకం సక్రమంగా అమలవుతుందా లేదా అని ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి వెంట అన్నమయ్య జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి, పీలేరు ఎంపీడీఓ శివశంకర్, ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ రాజమ్మ, సూపర్వైజర్లు స్వరూప, అక్కయ్యమ్మ, మహిళా పోలీస్ గీత, అంగన్వాడి కార్యకర్తలు ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మిషన్ లెర్నింగ్ వర్క్‌షాప్



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )

రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో గురువారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్, ఐబీఎం సంయుక్త ఆధ్వర్యంలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఎంవి నారాయణ తెలిపారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య వక్తగా ఎడునెట్ ఐబీఎం స్కిల్ ట్రైనర్, గుంటూరు ఈ. నరేంద్ర వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ ప్రస్తుత యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది అనేక రంగాలలో విప్లవాత్మక మార్పులను తెచ్చిందని రాబోయే రోజుల్లో ఏఐ, మిషన్ లెర్నింగ్, డీప్ లర్నింగ్ వంటి టెక్నాలజీలు ప్రపంచాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన ఉపకరణాలుగా నిలుస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎం వి నారాయణ మాట్లాడుతూ "నేటి విద్యార్థులు రాబోయే ఏఐ టెక్నాలజీ ఆధారిత ప్రపంచానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌లు నైపుణ్యాల పెంపుదలతోపాటు వారి భవిష్యత్తుకు దారి దీపాలుగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఎల్ హెచ్‌ఓడి డాక్టర్ టి హరికృష్ణ, కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణసురేఖ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలకు అధికారులు అన్వేషణ



పీలేరు జనవరి 30 ప్రభాతవార్త ః

మండల పరిధిలో ఎన్టీఆర్ గృహ పథకం కింద ఇళ్ల స్థలాల మంజూరు చేయడానికి సంబంధిత శాఖల అధికారులు అన్వేషణ ప్రారంభించారు. ఈ మేరకు గురువారం పీలేరు మండలం పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలపై విచారణ చేపట్టారు. నూనె విత్తల కర్మాగారం లేఅవుట్, కంకర ఫ్యాక్టరీ లేఅవుట్, ఏపీఐఐసీ 1, 2 ,3 ,4 లేఔట్లలో ఉన్న ఎన్టీఆర్ కాలనీలో విచారణ చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే కాలనీలో భారీ స్థాయిలో అవకతవకలు చోటుచేసుకున్నాయని హౌసింగ్‌తో సంబంధం లేకుండా రెవిన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు జారీ చేశారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఎంతమంది ఇండ్లు నిర్మాణాలు పూర్తి చేశారు ,ఎన్ని స్థలాలు ఖాళీలు ఉన్నాయి. వివిధ దశల్లో నిర్మాణాలు. ఎన్ని కొనసాగుతున్నాయి. అని అధికారులు తేల్చనున్నారు. ఈ పూర్తి నివేదిక అనంతరం జిల్లా స్థాయి అధికారులకు పంపిస్తామని హౌసింగ్ బి రమణయ్య తెలిపారు. విచారణలో రెవెన్యూ అధికారులు సచివాలయ ఉద్యోగులు కలిసి బృందాలుగా ఏర్పడి అనువణువు విచారిస్తున్నారు. ఈ విచారణ అనంతరం ఖాళీ స్థలాలను గుర్తించి ఇది వరకే పట్టాలి ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేసి ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేస్తామని హౌసింగ్ తెలిపారు.

## వైభవంగా స్వామివారి ద్వారా తోరణం



తంబళ్లపల్లె జనవరి 30 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లిలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో గురువారం రాజ గోపుర మహోత్సవాలలో భాగంగా ఉదయం ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ సారధ్యంలో ఆగమ అడ్వైజర్ శ్రీనివాస్ చార్యులు, కృష్ణ ప్రసాద్ భట్టార్, కృష్ణరాజు, రమేష్, ధనుష్ స్వాములు ఆలయ ముఖ ద్వారంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులకు వేద మంత్రోచ్చారణల మధ్య వైదిక కార్యక్రమాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించి ద్వారా తోరణం, ధ్వజ కుంభ ఆరాధన, చతుష్టార్చనల కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం చతుష్టార్చన, జలదివసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు భక్తులు పాల్గొన్నారు.

# నూతన కమిటీలు త్వరలో ఏర్పాటు

ప్రొద్దుటూరు జనవరి 30 ప్రభాతవార్త



రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గత 7 నెలల క్రితం అనగా జూన్ 20, 2024 వరకు ఉన్న కమిటీలను రద్దు చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి నిర్ణయం తీసుకున్నారని నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎస్ ఇర్ఫాన్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి త్వరలోనే నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని, నూతన కార్యవర్గ నాయకుల పేర్లను డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ద్వారా తాను కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సిఫారసు చేసినట్లు తెలిపారు. నూతన కమిటీలు ఏర్పాటు అయ్యేంతవరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న వారు ఎవరైనా పత్రిక సమావేశాలు నిర్వహిస్తే అవి వ్యక్తిగతమే కానీ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ విషయాన్నీ ప్రజలు మరియు పాత్రికేయ మిత్రులు గమనించాలని తెలిపారు.